కథా నిలయం
3627
శ్రీకాకుళం

With Best Compliments from
Ramisetty, Srikakulam - 532 001.

# మార్పు

చిన్నప్పటి నుంచి కథలంటే చెవి కోసుకోవడం అలవాటయిపోయింది. కథలు చెప్పేవాళ్ళన్నా, రాసే వాళ్ళన్నా నాకెంతో ఇష్టం. మనకు తెలియని లోకం గురించి వాళ్ళు చెప్తేనో, రాస్తేనో చెవులు కోసుకోమా ? కళ్ళు ఆనంద పారవశ్యంతో మూసుకోమా ?

మరీ చిన్నతనంలో మా జేజి చెప్పిన దయ్యాల కథలతో నా కథల కుతూహలం మొదలయింది. నా కిప్పటికీ జ్ఞాపకం – మా జేజి పదేపదే చెప్తున్న ఒక కథలో మా అబ్బ గ్రామ మునసబు రంగారెడ్డి దమ్మిడీ ఖర్చులేకుండా దయ్యాలతో యాభై ఎకరాల జొన్న కోతలు కోయించాడు. ఆ మా అబ్బనూ, దయ్యాలనూ నేను చూళ్ళేదు. మా అబ్బతోనే ఆ సత్యకాలం పోయిందనీ, పిదప కాలం వచ్చిందనీ మా జేజి చెప్పింది. అదేదో పోయినందుకూ ఇంకేదో కొత్తది వచ్చినందుకూ ఆ రోజుల్లో నేనెంత బాధపడ్డానో !

నేను ఎలిమెంటరీ క్లాసులో ఉన్నప్పుడు మా జేజి పోయింది. ఆమెతో బాటూ కథలు చెప్పే సత్యకాలమూ పోయింది. ఆ తర్వాత స్కూలులో పాఠాలే నాకు గతి. అయితేనేం, వాటి నిండా పురాణ కథలే కదా? అవి నన్నెంతో ఆకట్టుకున్నాయి. హైస్కూలు చదువులు పూర్తయ్యేసరికి కాశీమజిలీ కథలు, భేతాళ కథలు మొదలుకొని 'చచ్చి బతికిన మనిషి' దాకా చదివేశాను. కాలేజి రోజుల్లో నా గుండెల్లో మధురోహలను నింపి, నా నరాలను జివ్వు జివ్వుమనిపించిన ప్రబంధ కథలు మొదలుకొని అడ్డమొచ్చిన కథలన్నీ నమిలి పారేశాను.

నేను చదివిన కథల లోకమే అద్భుతమైంది. పిప్పరమెంట్లలా తియ్యనైంది. రమ్ములాగా మత్తెక్కించేది. నేను చదివిన ఎం. ఏ., తెలుగు కూడా ఈ రకం కథాలోక నిర్వికల్పానంద పోషణకు ఎంత బాగా తోడ్పడిందో, మాటల్లో చెప్పలేను.

వెధవది ఈ స్థితిని నేనెక్కువ కాలం అనుభవించలేకపోయాను. ఎం. ఏ., అయిపోయింది. ఇంకా ఉద్యోగం రాలేదు. ఈ లోపు మా నాన్న పోయాడు. మా అబ్బా, మా నాన్న నల్లచేసిన తెల్లకాగితాలకు మా ఆస్తి దాదాపు హరించుకొని పోయింది. మా నాన్నతోనే గ్రామ మునసబు గిరీ పోయింది. ఆయన మిగిల్చిందల్లా రెండెకరాలనూ, మా అమ్మనూ, ఎం.ఏ., ను నన్నూ, తమ్ముళ్ళిద్దరినీ, చెల్లెళ్ళిద్దరినీ. నాకేమయిందో కానీ, నేను విన్న జానపద కథల్లోలాగా నాజీవితం ఉండనందుకు మొదటిసారిగా ఆశ్చర్యపడ్డాను. ఏదో తెలియని, ఎవరిపైదో అర్థం కాని అసహనం, కోపం నాలో కలగడం మొదలయింది.

ఈ రోజుల్లో నేనొక కథ చదివాను. ఆ కథలో ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకొంటాడు. ఈ కథ పేరు 'హత్య'. ఈ కథలో తాదాత్మ్యం చెందాను. కథలోని యువకుని ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులను నేనూ అనుభవిస్తున్నట్లు రూఢి అయింది. ఇది నా జీవితంలో ఒక కొత్త అనుభవం. కథలో తెలిసిన లోకం. ఈ కథలోని పాయింటు- నిస్సహాయుడైన నిరుద్యోగి ఆత్మహత్య నన్ను వెర్రి కుక్కలాగా వెంటాడింది కొన్నాళ్ళు.

కలెక్టరు ఆఫీసులో కాపీయిస్టుగా నాకు టెంపరరీ ఉద్యోగం దొరకడంతో ఆ వెర్రికుక్క నన్ను తరమడం మానేసింది.

'హత్య' రాసిన రచయితదే మరో కథ చదవడం జరిగింది. రోడ్డు కంకర కొట్టి బతికే ఒక హరిజన స్త్రీ, సరైన తిండి తిప్పలూ లేక జబ్బుపడ్డ తన బిడ్డ జబ్బు నయం చేయించాలనుకొంటుంది. సరైన తిండీ, వైద్యమూ లేని ఆ బిడ్డ దారుణంగా చనిపోతాడు. 'ఈ అభాగిని' మరీ నన్ను కలచివేసింది. ఈ కథ చదవడంతో మా ఊళ్ళో నాటువైద్యునితో మందిప్పిస్తున్న మా చెల్లెలు టి. బి. నయం కాదనీ, ఆమె చనిపోవడం ఖాయమనీ తల్లడిల్లిపోయాను. అయితే కథలోలా మా చెల్లెలు చావలేదు. అందుకు సంతోషించడం బదులు నేను అప్పు

డప్పుడు బాధపడ్డం వాస్తవం. ఈ రాక్షస లక్షణం ఎందుకుంటుందోనని నా తల తిరగడం మొదలైంది.

సరిగ్గా ఈ రోజుల్లోనే యాదృచ్ఛికంగా పై రెండు కథలూ రాసిన జయచంద్రతో నాకు పరిచయమైంది. అతని పరిచయంతో కొత్త కథల లోకం కళ్ళముందు కొచ్చింది. అయితే ఈ లోకం నా కంత సులభంగా అర్థం కాలేదు.

మా వూళ్ళో జరిగిన ఒక గొడవతో కొత్త కథల్లోని పాత్రలూ, సన్నివేశాలూ, వాటి నాడించే దివ్యశక్తులూ కళ్ళకు గట్టాయి.

మా వూళ్ళో మాదిగిండ్లు మాత్రం ఒకరోజు తగలబడిపోయాయి. ఊళ్ళో రైతులంతా మగపురుగు లేకుండా పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ గొడవేదో మా యింటినీ చుట్టుకుందేమోనని భయపడి సెలవుపెట్టి మా వూరెళ్ళాను.

వల్లకాడైన మాదిగిండ్లను చూశాను. చెల్లాచెదిరిపోయిన పాడెల్లాగా కొట్టాలు; మట్టి సమాధుల్లాగా కొట్టాల మొండి గోడలు; కాటికుండల బొచ్చెల్లాగా మాదిగిళ్ళలో వాడుకునే కుండల పెంకులూ, బొచ్చెలూ. ఇళ్ళు కాలుతున్నపుడు ఎంత భయంకరంగా వుండి ఉంటుందో? కాటికాపరులు మాత్రమే చెప్పగలరు.

మా వూరి నుంచీ తిరిగి వచ్చిన ఆ మరునాడే జయచంద్ర కలిశాడు. మేం మామూలుగా కలిసే చోట్లో పార్కులో కూచున్నాం. జయచంద్రముందు నా బుర్రను తొలిచిందల్లా అనేయడం నా అలవాటు. ఉండబట్టలేక నేనే మా వూరి విషయం ఎత్తాను:

“రోజుకు రూపాయి కూలీ ఇప్పుడెక్కడన్నా వుందా? అందుకే ఇప్పుడింత గొడవ తాతల కాలంనుంచీ ఇస్తున్న రూపాయి కూలికే మాదిగెలు పనిచేయాలంటారు రైతులు. ఈ ధరల్లో అది గిట్టదన్నారు వాళ్ళు. కూలీ పెంచమన్నారు. దానికి రైతుల సమాధానంవింటే నవ్వాలో, ఏడ్వాలో తెలీదు. రైతులనేదేమంటే ‘సారాయి తాగే నా కొడుకులకు ఎంతిచ్చినా ఒకటే. ఏమన్నా మిగిలించుకొని చస్తారా? ఒళ్ళు పొగరెక్కి ఎప్పుడూ లేంది స్వతంత్రం వచ్చినా తిరగబడ్డం నేర్చుకున్నారు - మక్కెలు విరగదన్నేవాళ్ళులేక. వ్యవసాయం ఖర్చులు అమితంగా పెరిగి అల్లాడుతుంటే కూలి పెంచాలంట. యూరియా బ్లాకులో మూటే ఇన్నూరుంది. పైగా రైతు ఖర్చులెన్నని? అడిగినంత కూలీ ఇస్తే రైతు ముండ మోయాల్సిందే.”

“నిజమే,” జయచంద్ర మాటకు నాకు ఒళ్ళు మండింది.

“ఏం నిజం? కూలోళ్ళు ఒళ్ళు బలిసి సారాయి తాగరు. తాగితే మనం తాగుతాం.”

జయచంద్ర నా దూకుడుకు జడుసుకున్నట్లుంది. నెమ్మదిగా అన్నాడు:

“నా అభిప్రాయం అదికాదు. వ్యవసాయం గిట్టుబాటు విషయంలో రైతులు చెప్పేది నిజమే.”

నచ్చ చెప్పాలని చెప్పాను :

"మీరనేది మరీ పేద రైతుల విషయంలో నిజం కావచ్చు. వాళ్ళకు కూలీల్ని బెట్టుకునే స్తోమత ఉండదు. నేను మాట్లాడేది వందల ఎకరాలు, మిల్లులు ఉండేవాళ్ళ సంగతి. వాళ్ళకు వ్యవసాయం మాత్రమే కాదు, ఏదైనా గిట్టుబాటు అవుతుంది. వాళ్ళది పగటి దోపిడీ. ఇప్పటికీ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారంటే ఏమనాలి? మీరు నమ్మకపోవచ్చు. పొద్దున పేడకళ్ళూ, గంజీ ఎత్తిపోయాలి. మధ్యాహ్నం రెండు గంటలదాకా పొలంపని; మిగతా అప్పుడు దంచటమో, విసరటమో. రాత్రి మంచాలు వేయటం దాకా - దాదాపు పన్రెండు గంటలు పైగా గొడ్డు పని. సగం వెట్టి. ఆడా, మగా, పిల్లా భేదంలేదు. వీళ్ళిచ్చే రూపాయకు నోరులేని గొడ్డు కూడా పనిచెయ్యలేవు."

"కూలితోపాటు భోజనం ముప్పూటలా పెడతారు కదా! అది..."

"మాదిగోళ్ళకి పెట్టే భోజనం ఇంటి అల్లుళ్ళకు పెట్టినట్టు పెట్టరండీ!"

నా వెక్కిరింపు జయచంద్రకు తగిలింది. కాస్త గూఢంగా అన్నాడు :

"కూలీ ఎక్కువడగటం, సరే న్యాయమే. కానీ వాళ్ళు చేసే ప్రతి పనినీ సమర్థించటం కూడా అంత మంచిది కాదు."

"ఏ పనిని సమర్థించటం?" అడిగాను.

"అదే- రైతులు ఇళ్ళు విడిచి పారిపోతే వాళ్ళ ఇళ్ళమీదకు వెళ్ళి ఆడవాళ్ళను బండ బూతులు తిట్టడం, పైగా కమ్యూనిస్టులు వాళ్ళను తమ లాభం కోసం వెనకేసుక రావడం- ప్రతి విషయంలో."

"అబద్ధం! ఒకవేళ ఇలాంటి సందర్భాల్లో ఒకటో అరో మీరు చెప్పినట్లు కూడా జరగవచ్చు. కడుపులు కొడితే ఓర్పులుండవు. పైగా చదువూ సంస్కారం లేనివాళ్ళు. మనం ఇప్పటికీ బ్రాహ్మల తిడుతూనే వున్నాం కదా- వాళ్ళెప్పుడో అన్యాయాలు చేశారని. దానికేమంటారు? కొంపలు కాల్చారు. సాగుచేసుకుంటున్న బంజర్లను లాక్కోవాలని చూస్తున్నారు. ఇక కమ్యూనిస్టుల సంగతంటారా- అయినా వాళ్ళే ఎందుకు వెనకేసుకురావాలో కూడా ఆలోచించాల్సిందే."

జయచంద్ర నావైపు ఆశ్చర్యంగా చూశాడు. మనసులోది చెప్పాను :

"మీరీ విషయమై కథరాస్తే బావుంటుంది. న్యాయం హరిజనులది. ఇళ్ళకు నిప్పుపెట్టింది ఎవరన్నా కావచ్చు. పెట్టించింది పెద్దరెడ్లు. నోట్లో మట్టికొట్టేది వాళ్ళే. ఈ అన్యాయం, కథలో చెప్పాలి. రాయండి, మీరు రాయగలరు."

"మీరనేది బావుంది. ఎంత కోపాలొచ్చినా రైతులకు వాళ్ళ అవసరం ఉంది కదా? ఇంత ఘోరం చేశారా అని హరిజనులు వాళ్ళ ఇళ్ళకు వాళ్ళే నిప్పు పెట్టుకొన్నారని కూడా జనం అంటున్నారు..."

నా ఓర్పు పోయింది. ఇక అణచుకోలేకపోయాను.

"జనం అనడంలేదు. రైతులు ప్రచారం చేస్తున్నారు. వాళ్ళ పత్రికలు ఒకటో ఆరో ప్రచారం చేశాయి. వాళ్ళు పెద్దరెడ్లు. ఆ రక్తమే మీలోనూ ఉంది. మీకు నిజం కనపడదు. నన్ను నమ్మండి. లేదా మా ఊరు వెళ్ళి విచారించండి-కూలీనాలీ జనాన్ని. ఈ ఇండ్లకు నిప్పు పెట్టింది మా తమ్ముడు. రెండెకరాల భూస్వామి! కేవలం రైతుబుద్ధితోనే వాడీపని చెయ్యలేదు. పెద్దరైతులు మా దరిద్రాన్ని వాడుకొన్నారు-డబ్బిచ్చి, ఎప్పట్నుంచో హరిజనులు చేసుకొంటున్న బంజరును లాక్కొని ఇస్తామని ఆశపెట్టి."

జయచంద్ర ముందు నేను ఏడవలేను.

జయచంద్ర బదులు మాట్లాడలేదు.

ఈ మా నిశ్శబ్దాన్నీ, పార్కులో రేడియో సంగీతాన్నీ చీల్చుకొని ఏవో నినాదాలు వినిపించాయి. మేమిద్దరం రోడ్డుమీదకు వచ్చాం. రోడ్డుమీద ప్రదర్శన. మా ఊరి హరిజనుల సంబంధమైన ప్రదర్శన. ఆడా, మగా, పిల్లాపీచూ, ముసలీ ముతకా ప్రదర్శన. జనం పెద్దగాలేరు. రోడ్డు కటూ ఇటూ నిలబడి ఇదేదో తమాషా కింద కొట్టిపారేస్తున్న మనుషుల్నీ, వాళ్ళ నవ్వుల్నీ, వ్యాఖ్యానాల్నీ పట్టించుకోకుండా పట్టుదలతో, క్రమశిక్షణతో ముందుకు సాగిపోతున్న జనం.

నా రక్తంలో ఏదో అలజడి. జయచంద్రతో మాట్లాడదామని పక్కకు తిరిగి చూశాను. నా పక్కన జయచంద్ర లేడు. కథకుడు జయచంద్ర ప్రదర్శన జనం మధ్య కన్పించాడు.

నాకేమయింది ? పాఠకుణ్ణి నేనింకా రోడ్డుపక్కనే నిలవనా ?

○ 12 డిసెంబరు 1975, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక.